క్లుప్తంగా

గీత కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

గిద్దలూరు రూరల్: నియోజకవర్గంలోని గీత కార్మికుల సమస్యలు పరిష్కరించాలని రాష్ట్ర గౌడ వెల్ఫేర్ డెవలప్‌మెంట్ డైరెక్టర్ కంచర్ల కోటయ్యగౌడ్ స్థానిక ఎమ్మెల్యే అన్నా రాంబాబుతో కలిసి అసెంబ్లీ విరామ సమయంలో రాష్ట్ర అధికారులకు విజ్ఞప్తి చేశారు. ఉన్నతాధికారులు సానుకూలంగా స్పందించినట్లు ఆయన సోమవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో తెలిపారు.

యర్రగొండపాలెం వాసికి డాక్టరేట్


రమణారెడ్డి

యర్రగొండపాలెం: స్థానిక వై.కొత్తపల్లికి చెందిన బి.రమణారెడ్డికి డాక్టరేట్ లభించింది. ఆయన ప్రస్తుతం హైదరాబాద్‌లోని సీబీఐటీ కళాశాలలో సీఎస్‌ఈ విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పని చేస్తున్నారు. క్లౌడ్ కంప్యూటింగ్ వాతావరణంలో వనరుల కేటాయింపు పథకం కోసం ఆప్టిమైజేషన్ విధానాలపై స్టడీ చేయడంతో కర్ణాటక బెలగావిలోని విశ్వేశ్వరయ్య టెక్నాలజికల్ యూనివర్శిటీ వారు ఆయనకు డాక్టర్ ఆఫ్ ఫిలాసఫీ డిగ్రీ అందజేశారు. డాక్టరేట్ పొందిన రమణారెడ్డిని ఆ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ సీవీ నరసింహులు, సీఎస్‌ఈ విభాగ అధిపతి ప్రొఫెసర్ రమణ్ దుగ్యాల, వై.కొత్తపల్లి గ్రామస్తులు అభినందనలు తెలిపారు.

కందులాపురంలో నామట్టి-నాదేశం

కంభం: ఆజాదికా అమృత్ మహోత్సవ్ కార్యక్రమంలో భాగంగా సోమవారం మండలంలోని కందులాపురం-1 సచివాలయం పరిధిలో నామట్టి-నాదేశం కార్యక్రమం నిర్వహించారు. స్థానిక సర్పంచ్ బత్తుల తిరుపాలమ్మ (రజని) మాట్లాడుతూ ఒకే భారతం- శ్రేష్ఠ భారతం ఆదర్శాన్ని దేశం నలుమూల నుంచి సేకరించిన మట్టితో రూపొందించిన వాటిక సాకారం చేయగలదని, ఎక్స్ పోస్ట్ ద్వారా ప్రధాని నరేంద్రమోదీ నాదేశం -నామట్టి కార్యక్రమాన్ని ప్రవేశ పెట్టారన్నారు. ఈ సందర్భంగా మేళ తాళాలతో గ్రామంలోని ప్రతి ఇంటికి తిరిగి మట్టి, బియ్యం సేకరించారు. అనంతరం ప్రతిజ్ఞ కార్యక్రమం నిర్వహించారు. మూడు సచివాలయాల కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికులకు వైద్య పరీక్షలు

కంభం: స్వచ్ఛతహి సేవా కార్యక్రమంలో భాగంగా సోమవారం మండలంలోని కందులాపురం, ఎల్‌కోట సచివాలయాల్లో పారిశుధ్య కార్మికులకు హెల్త్ క్యాంప్ నిర్వహించారు. ఈ సందర్భంగా కార్మికులకు వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. కందులాపురం సర్పంచ్ బత్తుల తిరుపాలమ్మ, ఈఓపీఆర్డీ విజయలక్ష్మి, కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది, హెల్త్ సిబ్బంది పాల్గొన్నారు.

హ్యాండ్‌బాల్ పోటీలకు చందలూరు విద్యార్థులు


రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

దర్శి: రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీల్లో పాల్గొనేందుకు మండలంలోని చందలూరు జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎంపికయ్యారు. గత శనివారం జిల్లా స్థాయిలో తూర్పుగంగవరంలో నిర్వహించిన పోటీల్లో ఏడుగురు విద్యార్థులు ఎంపికైనట్లు పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు పీ వెంకటేశ్వరరెడ్డి తెలిపారు. ఎంపికైన విద్యార్థుల్లో సీనియర్ బాలుర విభాగంలో ఎస్.పవన్‌కుమార్, ఎం.రాకేష్, సీనియర్ బాలికల విభాగంలో కే నందిని, జూనియర్ విభాగంలో వై.దయాసాగర్, వై.బ్రిట్లి, జూనియర్ బాలికలలో ఏ ఆంజలిలాస్య, జి.శైలజ ఉన్నట్లు తెలిపారు. వీరు ఈ నెల 29వ తేదీ తెనాలిలో రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీల్లో పాల్గొననున్నారు. వీరు జాతీయస్థాయికి ఎంపిక కావాలని పాఠశాల హెచ్‌ఎం, ఉపాధ్యాయులు ఆకాంక్షించారు.

విద్యార్థులకు కంటి పరీక్షలు

కురిచేడు: జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహిస్తున్నట్లు వైద్యాధికారులు ప్రవీణ్, సుధారాణి తెలిపారు. స్థానిక జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో 160 మంది విద్యార్థులకు సోమవారం కంటి పరీక్షలు నిర్వహించారు. ఆప్తాల్మిక్ అధికారులు బీజేఎస్ హెరాల్డ్, ఏ గురుస్వామి విద్యార్థులకు కంటి పరీక్షలు చేశారు. వారిలో 22 మంది విద్యార్థులకు దృష్టి లోపం ఉన్నట్లు గుర్తించారు. దృష్టి లోపం ఉన్న విద్యార్థులకు జిల్లా అంధత్వ నివారణ సంఘం ఒంగోలు ద్వారా జగనన్న సురక్ష కార్యక్రమంలో ఉచితంగా కళ్లజోళ్లు అందజేయనున్నట్లు వైద్యాధికారులు తెలిపారు. కార్యక్రమంలో ఏఎన్‌ఎం షేక్ పర్వీన్, ఆశా వర్కర్లు యూ కొండమ్మ, నాగలక్ష్మి పాల్గొన్నారు.

జిల్లా స్థాయి షాట్‌పుట్ పోటీలకు ఎంపిక


సిరిచందన

మార్కాపురం: మార్కాపురంలోని జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో సోమవారం నిర్వహించిన పోటీల్లో షాట్‌పుట్ విభాగంలో కమలా కాన్సెప్ట్ స్కూల్ పదో తరగతి విద్యార్థి జి.సిరిచందన ప్రథమ స్థానంలో నిలిచి జిల్లా స్థాయి పోటీలకు ఎంపికైనట్లు కళాశాల కరస్పాండెంట్ పి.పవన్‌కుమార్, ప్రిన్సిపాల్ ఎంపీ పుల్లయ్య తెలిపారు. విద్యార్థిని సిరిచందనను ప్రిన్సిపాల్‌తో పాటు పీఈటీ జీవనందు అభినందించారు.

ప్రతి కుటుంబానికి మెరుగైన వైద్యం

తర్లుపాడు: ప్రతి కుటుంబానికి మెరుగైన వైద్యం అందించడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తోందని డీవైఎంహెచ్‌ఓ పద్మావతి పేర్కొన్నారు. సోమవారం స్థానిక పీహెచ్‌సీని సందర్శించిన ఆమె జగనన్న ఆరోగ్య సురక్ష సర్వే తీరుపై వైద్యాధికారులతో మాట్లాడారు. ఇంటింటి సర్వేలో దీర్ఘకాలిక, స్వల్పకాలిక జబ్బులతో బాధపడుతున్న వారిని గుర్తించి కేస్ షీట్లు నమోదు చేయాలన్నారు. మండలంలోని మీర్జపేట, నాగేళ్లముడుపు, తాడివారిపల్లి, చెన్నారెడ్డిపల్లి, తుమ్మలచెరువు, కలుజువ్వలపాడు, పోతలపాడు, సీతానాగులవరం సబ్ సెంటర్ల పరిధిలో సర్వే నిర్వహించినట్లు డీవైఎంహెచ్‌ఓకు వైద్యాధికారులు వివరించారు.

పుల్లలచెరువు: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా చేపట్టిన ఇంటింటి ఆరోగ్య సర్వే గ్రామాల్లో చురుగ్గా కొనసాగుతోంది. ఆరోగ్య సిబ్బంది ఇంటింటికీ వెళ్లి ప్రజల ఆరోగ్య వివరాలు తెలుసుకుని యాప్‌లో నమోదు చేస్తున్నారు. మండలంలోని పెద్ద పీఆర్‌సీ తండా పరిధిలో డాక్టర్ స్వామి ఆధ్వర్యంలో సిబ్బంది మంగళవారం సర్వే చేపట్టనున్నారు. గ్రామస్తులకు బీపీ, సుగర్ పరీక్షలు చేసి త్వరలో మెడికల్ క్యాంపు నిర్వహించి అవసరమైన మందులు పంపిణీ చేయనున్నారు.


బోడపాడులో ఆరోగ్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ పద్మావతి, సునీత

ప్రజారోగ్యమే ప్రభుత్వ లక్ష్యం

మార్కాపురం టౌన్: ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉండాలనే లక్ష్యంతో రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రారంభించారు. సోమవారం పట్టణంలోని పూలసుబ్బయ్య కాలనీ ప్రాంతంలో డాక్టర్ ఉదయ్ ఆధ్వర్యంలో ఆరోగ్య సిబ్బంది ఇంటింటికీ తిరిగి సర్వే చేపట్టారు. బీపీ, సుగర్, కిడ్నీ, లివర్, హార్ట్ తదితర జబ్బులతో బాధపడుతున్న వారిని పరీక్షించి సూచనలిచ్చారు.

■ మార్కాపురం రూరల్: ప్రతి ఒక్కరి ఆరోగ్యమే ప్రభుత్వ లక్ష్యమని డాక్టర్ సునీత అన్నారు. జగనన్న ఆరోగ్య సురక్షలో భాగంగా బోడపాడు గ్రామంలో ఆశ, ఏఎన్‌ఎమ్, ఎంపీహెచ్ సిబ్బందితో ఇంటింటి సర్వే నిర్వహించి ప్రజలతో మాట్లాడి వారికేమైనా దీర్ఘకాలిక, స్వల్పకాలిక జబ్బులున్నాయేమో తెలుసుకుని నమోదుచేశారు. కార్యక్రమంలో డీవైఎంహెచ్‌ఓ డాక్టర్ పద్మావతి పాల్గొన్నారు.


సీతానాగులవరంలో సర్వే చేస్తున్న వైద్య సిబ్బంది


మార్కాపురం: పూలసుబ్బయ్య కాలనీలో..


పుల్లలచెరువులో..

చదువుతోపాటు క్రీడలకు ప్రాధాన్యమివ్వాలి

● మున్సిపల్ చైర్మన్ కృష్ణ, ఎంపీపీ అరుణ

మార్కాపురం: విద్యార్థులు చదువుతోపాటు క్రీడలకు ప్రాధాన్యత ఇవ్వాలని మున్సిపల్ చైర్మన్ చిర్లంచర్ల బాలమురళీకృష్ణ, ఎంపీపీ పోరెడ్డి అరుణ చెంచిరెడ్డి పేర్కొన్నారు. సోమవారం పట్టణంలోని బాలుర ఉన్నత పాఠశాలలో మార్కాపురం, తర్లుపాడు, కొనకనమిట్ల, పొదిలి మండలాలకు చెందిన ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ పోటీలను ప్రారంభించారు. వారు మాట్లాడుతూ.. క్రీడలతో మానసిక వికాసం, శారీరక దృఢత్వం కలుగుతుందన్నారు. గెలుపోటములను సమానంగా తీసుకోవాలని, అయితే గెలుపుకోసం చివరివరకూ కష్టపడాలని సూచించారు. కార్యక్రమంలో ఎంఈఓలు రాందాస్‌నాయక్, టి.శ్రీనివాసులు, క్రీడల కోఆర్డినేటర్ ఎం.జాహ్నవి ప్రియ, పీఈటీలు మంత్రునాయక్, రమణయ్య, లక్ష్మీ నారాయణ, శ్యామల, రమేష్, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు. మొత్తం 30 పాఠశాలలకు చెందిన 250 మంది విద్యార్థులు పాల్గొన్నారు.


పోటీలను ప్రారంభిస్తున్న చైర్మన్ బాలమురళీకృష్ణ, ఎంపీపీ అరుణా చెంచిరెడ్డి

విద్యార్థులపై ఆధారపడిన దేశ భవిష్యత్తు

గిద్దలూరు రూరల్: విద్యార్థులపైనే దేశ భవిష్యత్తు ఆధారపడి ఉందని జన విజ్ఞాన వేదిక రాష్ట్ర నాయకుడు పి.స్వరూపారెడ్డి అన్నారు. పట్టణంలోని అరుణోదయ స్కూల్ ఆవరణలో సోమవారం దేశభక్తి ప్రచార వారోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎంత గొప్ప ప్రయాణమైన సరే మొదటి అడుగుతో ప్రారంభమవుతుందన్నారు. ఎంతటి గొప్పవ్యక్తి జీవితమైనా పాఠశాలలోనే ప్రారంభం అవుతుందన్నారు. దేశంలోని శాస్త్రవేత్తలు, మహాకవులు, సంఘ సంస్కకర్తలు, రచయితలు వంటి వారి గురించి వివరించారు. దేశం కోసం శ్రమించిన గొప్పవారి జీవితాలను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. జేవీవీ నాయకులు డీజీ బ్రహ్మనందరెడ్డి, మండ్ల శ్రీనివాసులు, గురుప్రసాద్, అంకయ్య, భాస్కర్, రమణ, శ్రీనివాసులు, చాంద్‌బాషా పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న జేవీవీ నాయకులు

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలి


కలశాలతో ర్యాలీ నిర్వహిస్తున్న ప్రజాప్రతినిధులు


బస్టాండ్ ప్రాంతంలో స్వచ్ఛత ర్యాలీ నిర్వహిస్తున్న శానిటేషన్ సిబ్బంది

మార్కాపురం టౌన్: మన చుట్టూ ఉండే పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని కౌన్సిలర్ సిరాజ్ తెలిపారు. సోమవారం స్వచ్ఛత హీ సేవ కార్యక్రమంలో భాగంగా ఆర్టీసీ బస్టాండ్, 9వ వార్డు పరిధిలో ప్రజలకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. బహిరంగ మల, మూత్ర విసర్జన, వ్యక్తిగత ఆరోగ్యం గురించి వివరించారు. శానిటరీ ఇన్స్‌పెక్టర్ నాయబ్ రసూల్, సచివాలయ సిబ్బంది, హెల్త్ అసిస్టెంట్ భాస్కర్, శానిటరీ, ఎన్విరాన్‌మెంట్ సెక్రటరీలు పాల్గొన్నారు.


పరిశుభ్రతపై అవగాహన పెంచుకోవాలి

బేస్తవారిపేట: పరిసరాల పరిశుభ్రతపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలని సర్పంచ్ తండ్రి బుద్దుల ప్రేమానంద్ అన్నారు. సోమవారం స్థానిక సచివాలయం-1 పరిధిలో నా దేశం-నా మట్టి కార్యక్రమంలో భాగంగా కలశాలతో ర్యాలీ నిర్వహించారు.

ప్రతి ఇంటి నుంచి మట్టి, బియ్యం సేకరించారు. మట్టి విలువ తెలుసుకోవాలని కోరారు. పరిశుభ్రత పాటించడంతో అనేక రకాల వ్యాధుల నుంచి రక్షణ పొందొచ్చన్నారు. పంచాయతీ కార్యదర్శి నరేంద్ర, ఎంపీటీసీ సభ్యురాలి భర్త దగ్గుబాటి బాలరంగయ్య, స్వచ్ఛ భారత్ మండల కోఆర్డినేటర్ మద్దుల వెంకటరెడ్డి, వలంటీర్లు పాల్గొన్నారు.

కోలాహలంగా గణేష్ నిమజ్జనం


నాయుడుపల్లిలో గణేష్ నిమజ్జనంలో యువకుల కోలాహలం


పాటలు పాడుతున్న జాహ్నవి

తర్లుపాడు: మండలంలోని పలు గ్రామాల్లో వినాయక చవితి నవరాత్రుల్లో భాగంగా ఏర్పాటు చేసిన గణేష్ విగ్రహాలను సోమవారం భక్తుల కోలహాలం మధ్య నిమజ్జనం చేశారు. స్థానిక బీసీ కాలనీ, నాయుడుపల్లిలోని విగ్రహాలను ఊరేగించి నిమజ్జనానికి తరలించారు. నాయుడుపల్లిలో గణేష్ యూత్ ఆధ్వర్యంలో వైఎస్సార్ సీపీ జిల్లా కౌన్సిల్ సభ్యులు రామసుబ్బారెడ్డిని వేడుకలకు ఆహ్వానించి అనంతరం ఘనంగా సన్మానించారు.

మార్కాపురం: మార్కాపురం పట్టణంలో గణేష్ నవరాత్రులు ఉత్సాహంగా సాగుతున్నాయి. ఎనిమిదో రోజు సోమవారం నిమజ్జనాలు, పూజలు ఘనంగా నిర్వహించారు. మార్కాపురం మెయిన్ బజారులో ఏర్పాటు చేసిన 10 అడుగుల గణపతి విగ్రహాన్ని ప్రత్యేకంగా అలంకరించారు. సోమవారం రాత్రి ప్రముఖ గాయని జె. జాహ్నవి ఆలపించిన భక్తి, జానపద గేయాలు ఆహూతులను అలరించాయి.

ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు

కురిచేడు: అప్పు తిరిగి చెల్లించమన్నందుకు తనను కులం పేరుతో దూషించినట్లు దేవరకొండ నాగమ్మ స్థానిక పోలీసులకు సోమవారం సాయంత్రం ఫిర్యాదు చేసింది. ఎస్సై దేవకుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. గంగమ్మ అనే మహిళకు దేవరకొండ నాగమ్మ రూ.8 లక్షల వరకు అప్పు ఇచ్చింది. తిరిగి చెల్లించమని అడగటంతో కులం పేరుతో దూషించిందని నాగమ్మ తన ఫిర్యాదులో పేర్కొంది. ఆ మేరకు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

ఘనంగా దీన్‌దయాళ్ జయంతి

మార్కాపురం: బీజేపీ సిద్ధాంతకర్త దీన్‌దయాళ్ ఉపాధ్యాయ జయంతిని సోమవారం ఆ పార్టీ నాయకులు ఘనంగా నిర్వహించారు. కళాశాల రోడ్డులో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఇన్‌చార్జి కృష్ణారావు మాట్లాడుతూ.. బీజేపీ కార్యకర్తలు దీన్‌దయాళ్ ఆశయాలను కొనసాగించేందుకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు కె.వెంకటరమణ, టి.రామచంద్ర, ఎం.లక్ష్మి, జీవీ రెడ్డి, నాగేశ్వరరావు, వాసవీ ప్రియ తదితరులు పాల్గొన్నారు.

పండిట్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయకు నివాళి

గిద్దలూరు రూరల్: పట్టణంలోని బీజేపీ కార్యాలయంలో పండిట్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ జయంతిని సోమవారం బీజేపీ నాయకులు నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకుడు వెంకటరామాంజనేయులు మాట్లాడుతూ పండిట్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ పూర్వ జనసంఘ్ వ్యవస్థాపకుడని, ఆయన పార్టీ అభివృద్ధి కోసం పాటుపడిన గొప్పవ్యక్తి అని కొనియాడారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. బీజేపీ నాయకులు చంద్రమోహన్, మారుతిప్రసాద్, మల్లారెడ్డి, పుల్లయ్య పాల్గొన్నారు.

ఫార్మసీ విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్

మార్కాపురం టౌన్: ఫార్మసి విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు ఉందని జిల్లా వైద్యశాల సైకియాట్రిస్ట్ డాక్టర్ షేక్ ఖాజామొహిద్దీన్ పేర్కొన్నారు. సోమవారం వరల్డ్ ఫార్మసిస్ట్ డే సందర్భంగా డాక్టర్ సామ్యేల్ జార్జ్ ఫార్మసీ కళాశాలలో నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. హెల్త్‌కేర్ సిస్టమ్‌ను దృఢంగా మార్చడంలో ఫార్మసిస్టులు ముఖ్యమన్నారు. డాక్టర్లు సర్జరీలు, డయాగ్నసిస్ మాత్రమే చేయగలరని ఫార్మాసిస్టులు రోగానికి ఔషధాలను కనుక్కోవడంతోపాటు ఇన్‌ఫెక్టివ్ ఏరియాకు డ్రగ్ చేరేలా చేయగలరన్నారు. మెడికల్ విభాగంలో ఫార్మసిస్టు పాత్ర చాలా ప్రధానమన్నారు. కళాశాల కార్యదర్శి డాక్టర్ ఆదిమూలపు సతీష్, ప్రిన్సిపాల్, సిబ్బంది పాల్గొన్నారు.

బైక్‌తో ఢీకొట్టడంతో వ్యక్తికి గాయాలు

కురిచేడు: పాతకక్షల నేపథ్యంలో రోడ్డుపై నిలబడి ఉన్న వ్యక్తిని బైక్‌తో ఢీకొట్టడంతో గాయాలైన సంఘటన మండలంలోని ఆవులమంద పంచాయతీ ముష్టిగంగవరం గ్రామంలో సోమవారం చోటుచేసుకుంది. ఎస్సై ఎం.దేవకుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. ముష్టిగంగవరం గ్రామానికి చెందిన మాగులూరి సత్యనారాయణకు అదే గ్రామానికి చెందిన ఉన్నగిరి రామలింగయ్యకు మధ్య పాతకక్షలున్నాయి. సోమవారం సాయంత్రం గ్రామంలో రోడ్డుపై నిలబడి ఉన్న సత్యనారాయణను రామలింగయ్య తన బైక్‌తో ఢీకొట్టాడు. దీంతో సత్యనారాయణ కిందపడి గాయపడ్డాడు. సత్యనారాయణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై దేవకుమార్ తెలిపారు.

మండలాభివృద్ధికి పాటుపడాలి


సమావేశంలో మాట్లాడుతున్న కో ఆర్డినేటర్ వందనం

యర్రగొండపాలెం: జిల్లాలో పూర్తిగా వెనకబడిన యర్రగొండపాలెం మండలాన్ని రాష్ట్ర సగటు స్థాయికి తీసుకెళ్లే విధంగా వివిధ శాఖలకు చెందిన అధికారులు సమన్వయంగా పనిచేయాలని చింతన్ శివిర్ జిల్లా కోఆర్డినేటర్లు వందనం, ప్రమోద్ అన్నారు. సోమవారం స్థానిక బీఆర్ అంబేద్కర్, జగ్జీవన్‌రాం ఆడిటోరియంలో ఆస్పిరేషనల్ బ్లాక్ ప్రోగ్రాంలో భాగంగా చింతన్ శివిర్‌ను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం నిర్దేశించిన శాఖల ప్రకారం ఆరోగ్యం, పౌష్టికాహారం, విద్య, వ్యవసాయ రంగం, మౌలిక సదుపాయాలు, సోషల్ డెవలప్‌మెంట్‌లను అభివృద్ధి చేయాల్సి ఉందని, ఆయా శాఖలకు చెందిన అధికారులు సమన్వయంతో పనిచేస్తేనే మండలం అభివృద్ధి చెందుతుందన్నారు. ఎంపీపీ దొంతా కిరణ్‌గౌడ్, జెడ్పీటీసీ చేదూరి విజయభాస్కర్, డీఎల్‌డీవో బీవీఎస్ సాయికుమార్, ఎంపీడీవో వైవీ నాగేశ్వర ప్రసాద్, ఎంఈవో పి.ఆంజనేయులు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శ్రీకాంత్, సీడీపీవో పద్మావతి, వార్డన్ యాసిన్‌బేగం, ఏపీవోలు శైలజ, నాగేశ్వరరావు, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు కె.ఓబులరెడ్డి, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

మాగుంటను సన్మానించిన జంకె

మార్కాపురం: వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జంకె వెంకటరెడ్డి ఆదివారం రాత్రి ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి కుమారుడు రాఘవరెడ్డిని సన్మానించారు. మార్కాపురంలో వివిధ కార్యక్రమాల్లో పాల్గొనేందుకు వచ్చిన ఆయన రాత్రి మార్కాపురంలోని జంకె నివాసానికి వెళ్లారు. తాజా రాజకీయాలపై చర్చించిన అనంతరం రాఘవరెడ్డిని జంకె సత్కరించారు. వైఎస్సార్ సీపీ నాయకులు మందటి మహేశ్వరరెడ్డి, ఒంటెద్దు రామకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మాగుంట రాఘవరెడ్డి ప్రత్యేక పూజలు

త్రిపురాంతకం: శ్రీబాలాత్రిపురసుందరీదేవి, శ్రీపార్వతి సమేత త్రిపురాంతకేశ్వరస్వామి ఆలయాల్లో వైఎస్సార్ సీపీ యువ నాయకుడు మాగుంట రాఘవరెడ్డి సోమవారం ప్రత్యేక పూజలు చేశారు. త్రిపురాంతకం ఆలయాలను దర్శించుకుని అమ్మవారికి కుంకుమార్చన, స్వామివారికి అభిషేకం రాఘవరెడ్డితో అర్చకులు ప్రసాదశర్మ, విశ్వనారాయణశాస్త్రి జరిపించారు. ఎంపీపీ కోట్ల సుబ్బారెడ్డి, సొసైటీ అధ్యక్షుడు దగ్గుల గోపాల్‌రెడ్డి, ట్రస్ట్‌బోర్డు మాజీ సభ్యుడు మల్లికార్జున్, పార్టీ నాయకులు నక్కా చిన్న త్రిపురరెడ్డి, సత్యనారాయణరెడ్డి ఉన్నారు. ఈఓ సాదర స్వాగతం పలికారు.


మాగుంట రాఘవరెడ్డిని సన్మానిస్తున్న జంకె వెంకటరెడ్డి

వైఎస్సార్ సీపీ నాయకుడిని పరామర్శించిన బూచేపల్లి

దొనకొండ: మండలంలోని పి.వెంకటాపురం గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు, మాజీ ఎంపీటీసీ విప్పర్ల సుబ్బయ్య కొన్ని రోజుల నుంచి అనారోగ్యంతో బాధపడుతున్నారు. హైదరాబాద్‌లో మెరుగైన వైద్యం పొంది స్వగ్రామానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా దర్శి మాజీ ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి వెంకటాపురం గ్రామానికి వెళ్లి సుబ్బయ్యను పరామర్శించారు. నేనున్నానంటూ భరోసా ఇచ్చారు. ఆయన వెంట వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ కాకర్ల కృష్ణారెడ్డి, నాయకుడు కాలూరి రమణయ్య పాల్గొన్నారు.


సుబ్బయ్యను పరామర్శిస్తున్న బూచేపల్లి

ఈవ్‌టీజింగ్ నేరం

● జూనియర్ సివిల్ జడ్జి సరస్వతి

దర్శి: విద్యార్థినులను ర్యాగింగ్, ఈవ్‌టీజింగ్ చేయడం నేరమని, అలా చేస్తే చట్టాలు కఠినంగా శిక్షిస్తాయని జూనియర్ సివిల్ జడ్జి జీవీఎల్ సరస్వతి సూచించారు. స్థానిక ఝాన్సీ మహిళా జూనియర్ కళాశాలలో చట్టంపై సోమవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి సరస్వతి మాట్లాడుతూ విద్యార్థులు అవమానాలు జరిగితే వెంటనే ఫిర్యాదు చేయాలని సూచించారు. ఎవరికీ భయపడాల్సిన అవసరం లేదని చెప్పారు. కళాశాలల్లో చక్కగా చదువుకుని తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలన్నారు. చట్టాలు తెలుసుకుంటే భయం పోయి ధైర్యంగా ఉంటారని చెప్పారు. కార్యక్రమంలో న్యాయవాదులు ఎం.నారాయణ, పీ సురేష్, తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న జూనియర్ సివిల్ జడ్జి సరస్వతి

మంత్రి చొరవతో మంచినీటి బోరు

పుల్లలచెరువు: రాష్ట్ర పురపాలకశాఖ మంత్రి ఆదిమూలపు సురేష్ చొరవతో స్థానిక ఎస్సీ పాలెంలో మంచినీటి బోరు ఏర్పాటు చేశారు. ఎస్సీ పాలెంలో మంచినీటి సమస్య ఎక్కువగా ఉందని స్థానికుడు, మంత్రి పీఆర్వో బంకా శ్రీనివాసరావు మంత్రి సురేష్ దృష్టికి తీసుకెళ్లారు. మంత్రి తన సొంత నిధులతో బోరు వేయిస్తానని చెప్పడంతో సోమవారం బోరు వేశారు. సమస్యను పరిష్కరించిన మంత్రి సురేష్‌కు కృతజ్ఞతలు తెలియజేశారు. ఎంపీటీసీ రాములు, పీఏసీఎస్ డైరెక్టర్ రఘు, నాయకులు గొడుగు ఆంజనేయులు, వెంకటేశ్వర్లు, గంగరాజు పాల్గొన్నారు.


మంత్రి సొంత నిధులతో వేస్తున్న బోరు

బీసీలు వైఎస్సార్ కాంగ్రెస్‌కే మద్దతు

గిద్దలూరు రూరల్: బీసీలంతా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకే పూర్తి మద్దతు తెలియజేస్తున్నారని నగర పంచాయతీ చైర్మన్ పాముల వెంకట సుబ్బయ్య యాదవ్ అన్నారు. పట్టణంలోని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో సోమవారం ఆ పార్టీ నాయకులు ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బుడతా మధుసూదన్‌రావు వైఎస్సార్ సీపీలో ఉంటూ జెడ్పీటీసీ పదవి పొంది, ఆ పదవికి రాజీనామా చేయకుండా పార్టీ మారడం సరైన పద్ధతి కాదన్నారు. ఆయనతో పాటు ఒకరిద్దరు సర్పంచ్‌లు పార్టీ మారడంతో వచ్చిన నష్టం లేదని గుర్తుచేశారు. గతంలో కంటే గిద్దలూరు నియోజకవర్గంలో అత్యధిక మెజార్టీ అన్నా రాంబాబుకు ఇస్తారన్నారు. తప్పుడు విధానాలతో పార్టీలు మారడం సమంజసం కాదన్నారు. బడుగు బలహీనవర్గాల అభ్యున్నతి కోసం అహర్నిశలూ శ్రమించే ఏకైక పార్టీ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అని గుర్తు చేశారు. కేవలం వ్యక్తిగత స్వార్థంతో వారి స్వలాభం కోసం టీడీపీలో చేరారే తప్ప చంద్రబాబు మీద ప్రేమతో కానీ ఆయన అరెస్టుకు కాదని ప్రజలందరికీ తెలుసన్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి, ఎమ్మెల్యే అన్నా రాంబాబుల ఆశయాలకు అనుగుణంగా నియోజకవర్గంలోని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పని చేస్తున్నారని పేర్కొన్నారు. సమావేశంలో వైస్ చైర్మన్ ఆర్‌డీ రామకృష్ణ, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ కోటా నరసింహులు, వైస్ ఎంపీపీ నోవెల్, మండల సచివాలయ కన్వీనర్ ఓబులరావు యాదవ్, వైఎస్సార్ సీపీ నాయకులు డాక్టర్ భూమా నరసింహారెడ్డి, ముద్దర్ల శ్రీను, షేక్ షఫ్లావలి, పగడాల వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న చైర్మన్ వెంకట సుబ్బయ్య

పంట నమోదును తనిఖీ చేసిన ఏడీఏ

బేస్తవారిపేట: మండలంలోని కోనపల్లె ఆర్‌బీకే పరిధిలో పంట నమోదును గిద్దలూరు వ్యవసాయశాఖ సహాయ సంచాలకుడు బాలాజీనాయక్ సోమవారం తనిఖీ చేశారు. ఈ నెల 30వ తేదీలోపు ప్రతి రైతు ఖరీఫ్ సీజన్‌లో సాగు చేసిన పంటలను తప్పనిసరిగా ఈ-క్రాప్ బుకింగ్, ఈకేవైసీ చేయించుకోవాలన్నారు. పంట నమోదు చేయించుకోని రైతులకు ప్రభుత్వం అందించే ప్రోత్సాహకాలు, పంట నష్టపరిహారం పొందలేరన్నారు. రైతులు పొలంలో ఏ రకం పంటలు సాగు చేశారు, ఆన్‌లైన్‌లో ఏ పంటలు నమోదు చేశారని క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఏఓ జక్కం మెర్సీ, వీఏఏ, వీఆర్‌ఓలు పాల్గొన్నారు.


పంట నమోదును పరిశీలిస్తున్న ఏడీఏ బాలాజీనాయక్